# ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 9 : లోక్‌సభ ఎన్నికలను త్వరలో నిర్ణయించనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాను సవరించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో ముసాయిదా జాబితాను అధికారికంగా విడుదల చేసిన సంగతి తెలిసిందే. మరో ఆరు నెలల్లో పార్లమెంట్ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు సవరణ షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 20 నుంచి జనవరి 5వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, ఫొటోల మార్పు, 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు ఉపయోగపడుతుందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఓటర్ల ముసాయిదా జాబితాను జనవరి 6న ప్రకటించి, తుది ఓటరు జాబితాను మార్పుల అనంతరం 8వ తేదీ వరకు అధికారికంగా ప్రకటించనున్నారు. అందుకు ఆయా రెవెన్యూ కార్యాలయాల్లో కసరత్తును ప్రారంభించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

CHANGE OF NAME

★I,BHADRA SUJAN KUMAR S/o. Haripada Bhadra R/o. H.No. 4-308, Zafarnagar, Mandal: Mancherial, District: Mancherial Previously our daughter's name was BHADRA SUPRIYA (the old name) now we have Changed my daughter's name as BHADRA SHREYA (the new name), D/o. Bhadra Sujan Kumar .
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## బీట్ అధికారిణి ఆత్మహత్యా యత్నం

- చికిత్స పొందుతున్న శ్రీలత
- అధికారుల వేధింపులే కారణమంటూ ఆరోపణ
- తనకు సంబంధం లేదని రేంజర్ రవి వివరణ


చికిత్స పొందుతున్న ఫారెస్ట్ బీట్ అధికారిణి శ్రీలత

కోటపల్లి, డిసెంబర్ 9 : కోటపల్లి మండలం వెంచపల్లి ఫారెస్ట్ బీట్ అధికారిణి శ్రీలత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య యత్నానికి పాల్పడడం సంచలనం సృష్టించింది. తెలిసిన వివరాల ప్రకారం.. శుక్రవారం కార్యాలయం నుంచి వెంచపల్లిలోని తన క్వార్టర్స్‌కు వెళ్లిన శ్రీలత, రాత్రి సమయంలో నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నది. గమనించిన భర్త రాజేశ్ మంచిర్యాలలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కాగా, ఉన్నతాధికారుల వేధింపులతోనే ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు శ్రీలత ఆరోపిస్తున్నది. శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. వెంచపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో ప్లాంటేషన్ నిర్వహించేందుకు బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీల బృందాన్ని తీసుకువచ్చారు. ఆ బృందం సభ్యుడు కూలి చెల్లించాలని శ్రీలతను కోరగా, చెల్లింపులతో తమకు సంబంధం లేదని, ఉన్నతాదికారులు చెల్లిస్తారని చెప్పింది. డబ్బుల జాప్యంపై కూలీల బృందం సభ్యుడు జిల్లా అటవీ సంరక్షణ అధికారి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వెంటనే కూలి చెల్లింపులు చేపట్టాలని సంబంధిత అధికారి ఆదేశించారు. ఈ విషయమై మాట్లాడేందుకు రేంజ్ కార్యాలయానికి రావాలని శుక్రవారం శ్రీలతకు కోటపల్లి రేంజర్ రవి ఫోన్ చేశాడు. సాయంత్రమైనా రేంజర్ కార్యాలయానికి రాకపోవడంతో ఇంటికి బయల్దేరింది. ఆ సమయంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ద్వారా ఫోన్ చేసి, తిరిగి కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో శ్రీలత తిరిగి రేంజ్ కార్యాలయానికి వెళ్లింది. శ్రీలత వల్ల తనకు చెడ్డపేరు వచ్చిందని, సస్పెండ్ చేస్తానని రేంజర్ బెదిరించాడు. దీంతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ విషయమై రేంజర్ రవిని వివరణ కోరగా, తాను ఎవరినీ వేధించలేదని, ఎఫ్‌బీవో శ్రీలత ఆత్మహత్యా యత్నానికి, తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పాడు. తన వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ఉంటారని, తాను విధి నిర్వహణలో ఎవ్వరినీ వేధించలేదని పేర్కొన్నారు. విధులకు సంబంధించిన సూచనలు చేశానే తప్ప ఎవరినీ దూషించలేదని వివరించారు.

# యాసంగికి సాగునీరు

- ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పుష్కలం
- శనగ, జొన్న, గోధుమ పంటల సాగు


మత్తడి ప్రాజెక్టు

ఆదిలాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి కొరత కారణంగా వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసేవారు. సాగునీటి ప్రాజెక్టులు ఉన్నా నిర్వహణ లేకపోవడం వ్యవసాయ భూములకు సాగునీరు అందేది కాదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగానికి పెద్దపీట వేసింది. ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు మరమ్మతులు, కాలువల ఆధునీకరణ, మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా చెరువులను బాగు చేసింది. దీంతో జిల్లాలో రైతులకు రెండు పంటలకు సాగునీరు అందుతున్నది. ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకున్న చర్యల కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. రెండు సీజన్లలో రైతులు లాభదాయకమైన పంటలు సాగు చేస్తున్నారు. గతంలో సాగునీటి ఇబ్బందుల కారణంగా ఒక పంట వేయాలంటే భయపడే రైతులు ఇప్పుడు నిర్భయంగా రెండు సీజన్లలో పంటలు సాగు చేస్తున్నారు. అధికారులు సైతం రైతులు పండించే పంటలకు అవసరమైన సమయాల్లో ప్రాజెక్టుల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు.

### ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ఈ ఏడాది వానకాలంలో ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా సాగునీటి ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు చేరింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 1087.6 మిల్లీ మీటర్లు కాగా, 1249.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులు గరిష్ఠ నీటి మట్టానికి చేరుకున్నారు. సీజన్‌లో భారీ వర్షాల సమయంలో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి కాలువల ద్వారా నీటిని బయటకు వదిలారు. ప్రాజెక్టు కింద ఆయకట్టుకు వానకాలం పంటలకు రైతులకు నీటిని సరఫరా చేశారు. జిల్లాలోని 1.50 లక్షల ఎకరాల్లో యాసంగి సాగువిస్తీర్ణం ఉండగా, ప్రాజెక్టుల ద్వారా పంటలకు నీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని సాత్నాల ప్రాజెక్టు కింద 18 వేలు, మత్తడివాగు ప్రాజెక్టు కింద 6 వేల ఎకరాలను సాగునీటిని అందించనున్నారు. 3 నెలల పాటు వారబందీ విధానంలో పంటలకు నీటిని అందించనున్నారు. యాసంగి పంటలకు అవసరమైన సాగునీరు లభిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# కొండదిగిన కోడికూర

- అమాంతం పడిపోయిన ధరలు
- రూ.220 నుంచి రూ.160కి తగ్గిన కిలో చికెన్
- రూ.130 నుంచి రూ.85కు పడిపోయిన కిలో కోడి
- కార్తీక మాసం, కోళ్ల ఉత్పత్తి పెరగడమే కారణం!



జిల్లా కేంద్రంలో చికెన్ షాప్

ఆసిఫాబాద్, డిసెంబర్ 9 : గత పదిహేను రోజుల క్రితం వరకు కొండెక్కి కూర్చున్న చెకెన్ ధరలు.. ఒక్కసారిగా దగ్గుముఖం పట్టాయి. నాన్‌వెజ్ ప్రియులకు షాకిచ్చిన రేట్లు భారీగా పడిపోయాయి. ఎండాకాలం మొత్తం వేడికి కోళ్లు మృత్యువాత పడడం.., కోడి పిల్లలు ఎదగకపోవడం.., మార్కెట్లో డిమాండ్‌కు తగ్గ చికెన్ ఉత్పత్తి కాకపోవడంతో ఆ సీజన్ మొత్తం ధరలు విపరీతంగా పెరిగాయి. అయితే ఇప్పుడు మార్కెట్లో చికెన్ డిమాండ్ తగ్గడంతో పాటు, వర్షాలు పడడంతో కోళ్ల మరణాలు తగ్గి ఉత్పత్తి పెరిగింది. దీంతో చికెన్ ధరలు నిదానంగా దిగివచ్చాయి. దీంతో చికెన్ ప్రియులు సంతోష పడుతున్నారు. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో చాలామంది నాన్‌వేజ్ తినరు. అంతేకాకండా అయ్యప్ప దీక్షలు ప్రారంభమవడం కూడా చికెన్ విక్రయాలపై ప్రభావం చూపుతున్నది. కొనుగోళ్లు చాలావరకు తగ్గిపోయాయి. శ్రావణ, కార్తీకమాసాల ఎఫెక్ట్‌తో ప్రస్తుతం చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. దాదాపు రెండు నెలల పాటు రూ.240 నుంచి రూ.300 వరకు ధరలు పలికాయి. 15 రోజుల కాలంలో ఏకంగా రూ.140 నుంచి రూ.160 మేర ధరలు తగ్గాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో లైవ్ కోడి ధర రూ.85కు లభిస్తున్నది. కిలో చికెన్ స్కిన్‌తో రూ.180 నుంచి రూ.200కు విక్రయిస్తున్నారు. రెండు రోజులుగా ధరలు మెల్లిగా పెరుగుతున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. కానీ, జిల్లాలో కార్తీకమాసం ముగియగానే షష్టివారాలు ప్రారంభమవుతాయి. దీంతో కూడా చికెన్ విక్రయలపై పెద్ద ప్రభావం పడుతుందని వ్యాపారులు వాపోతున్నారు.

### ❖ ధర సగానికి సగం తగ్గింది..



*మొన్నటివరకు ఎలెక్షన్స్ కావడంతో అమ్మకాలు బాగుండె. ఇప్పుడు కార్తీక మాసంతో ధరలు ఒక్కసారిగా సగానికి సగం తగ్గాయి. కిలో చికెన్ రూ.140 నుంచి రూ.160కి అమ్మకాలు జరుగుతున్నయ్. అయినప్పటికీ అమ్మకాలు మాత్రం పెరగలేదు. గడిచిన నాలుగు నెలల్లో కిలో చికెన్ ధర చేరుకున్న కనిష్ఠ ధర ఇదే. కోళ్లు ఒక పరిమాణానికి వచ్చిన తర్వాత కచ్చితంగా వాటిని విక్రయించాల్సిందే. లేకపోతే వాటికి మేత ఎక్కువవడంతో పాటు అనారోగ్యం బారిన పడే అవకాశాలుంటాయి.*

**- జాకీర్, చికెన్ షాపు యాజమాని, ఆసిఫాబాద్**

### ❖ 40 శాతం అమ్మకాలు తగ్గినయ్..



*ఒకవైపు చలి తీవ్రత ఎక్కువ. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో కూడా ధరలు తగ్గాయి. ఏకంగా 40 శాతం అమ్మకాలు తగ్గిపోయాయి. కార్తీక మాసం ముగిసే సమయానికి ఇలాగే ఉండే అవకాశాలున్నాయి. కార్తీకమాసం తర్వాత ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. కానీ ఈ ప్రాంతంలో షష్ఠి బోనాలు ఉంటాయి. కాబట్టి వ్యాపారాలపై భారం పడుతుంది. ఈ ఏడాది వ్యాపారాలపై చాలా ప్రభావం పడుతుంది. ధరలు తగ్గినప్పటికీ గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నాం.*

**- షేహెరాజ్, చికెన్ షాప్ నిర్వాహకుడు, ఆసిఫాబాద్**

# జాతీయస్థాయికి ఎంపిక



ఎంపికైన విద్యార్థులు అజయ్, ప్రశాంత్

లక్సెట్టిపేట, డిసెంబర్ 9 : జాతీయస్థాయి క్రీడలకు లక్సెట్టిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గౌతంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు హన్మకొండలో నిర్వహించిన అండర్-19 జోనల్ క్రీడల్లో అజయ్ (జావెలింగ్ త్రో) ద్వితీయ, ప్రశాంత్ (6 కేఎం రన్నింగ్) నాల్గో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఈ నెలాఖరున ముంబైలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల సిబ్బంది అభినందించారు.